క్లుప్తంగా

'హామీలు నెరవేర్చకుంటే గుణపాఠం తప్పదు'



నర్సంపేట : ఎన్నికల హామీలు అమలు చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి 50 శాతం మందికి కూడా పూర్తిగా చేయలేదని తెలిపారు. అలాగే రూ.2 లక్షలకుపైగా రుణం ఉన్న రైతులు మిగతా డబ్బులు బ్యాంకులకు చెల్లించినా మళ్లీ అప్పులపాలయ్యారని చెప్పారు. రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి 12 వేలకు తగ్గించి వాయిదాలతో కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. పెట్టుబడి సాయానికి కోతలు పెట్టి నేటికి రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయలేదని చెప్పారు. అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించి కేవలం సన్నవడ్లకే ఇస్తామని మాట మార్చారని తెలిపారు. ప్రైవేటుగా రూ.3 వేల ధర ఉన్నా బోనస్ కోసం రైతులు ప్రభుత్వాన్ని నమ్మి ధాన్యాన్ని విక్రయిస్తే ఇంతవరకు వారి ఖాతాల్లో బోనస్ జమ చేయకపోవడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే రైతులకు బోనస్ చెల్లించడంతోపాటు ఇతర హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

'ఎస్సీ వర్గీకరణను సమీక్షించి సరిచేయండి'



వర్ధన్నపేట : ఎస్సీ వర్గీకరణను సమీక్షించి సరిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ కోచైర్మన్ దామోదర రాజనరసింహను స్థానిక అంబేడ్కరిజమ్ జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు జేఏసీ నాయకుడు తుమ్మల శ్రీధర్ ఆధ్వర్యంలోని బృందం మంత్రిని హైదరాబాద్‌లోని నివాసంలో ఆదివారం కలిసి మాట్లాడింది. వర్గీకరణలో జరిగిన అవకతవకలపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఇచ్చిన వివరణతో తాము ఏకీభవించి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. జాతిని సంతృప్తి పర్చేలా వర్గీకరణలో సవరణలు చేసి మంద కృష్ణ సుదీర్ఘ ఉద్యమ పోరాట అంతర్గత సామాజిక న్యాయ సూత్రానికి సార్థకత చేకూర్చాలని కోరినట్లు చెప్పారు. తొలుత మంత్రికి పూలబొకే అందజేశారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కృష్ణంరాజు



దుగ్గొండి : మండలంలోని మహ్మదాపురం గ్రామానికి కాంగ్రెస్ పార్టీ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా గడ్డె కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా మురహరి గోవర్ధన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెపు అనిల్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఒలిగె నర్సింగరావు, డ్యాగం శివాజి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పర్వతగిరి : వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌ను అతడి తల్లి వెంకటమ్మ ఇటీవల మృతి చెందిన క్రమంలో మండల నాయకులు ఆదివారం పరామర్శించారు. తొలుత మృతురాలి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏనుగల్ మాజీ ఎంపీటీసీ కోలా మల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ సతీశ్‌రావు, ఆత్మ మాజీ డైరెక్టర్ బుక్క కుమార్, టీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మాసాని వెంకట్, బీజేపీ జిల్లా నాయకుడు గూడ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మొగిలిచర్లలో..

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 15వ డివిజన్ మొగిలిచర్లలో ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, న్యాయవాది చింతం సదానందంను అతడి తల్లి వెంకటలక్ష్మి ఇటీవల మృతి చెందిన క్రమంలో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి లడే రమేశ్, న్యాయవాదులు గుడిమల్ల రవికుమార్, అల్లం నాగరాజు, సాంబశివరావు, గోయిల్, సురేశ్, కృష్ణమూర్తి, శివరాజ్ తదితరులు పరామర్శించారు. తొలుత వారు వెంకటలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేలేరు : మండల కేంద్రానికి చెందిన వల్లెపు వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం 50 కేజీల బియ్యం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు మహిపాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో దుర్గంధం

- సైడ్‌కాల్వలు నిండిపోయి వెతలు
- సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం



సమస్యను వివరిస్తున్న కాలనీవాసులు

దుగ్గొండి : మండలంలోని రేబల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీలో దుర్గంధం స్థానికులను బెంబేలెత్తిస్తోంది. సైడ్ కాల్వలు పూర్తిగా నిండిపోయి కంపుకొడుతుండంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాల్వల్లో మట్టి పేరుకుపోయినా ఏడాదిగా తొలగించిన దాఖలాల్లేవు. ఈ క్రమంలో దోమలు విపరీతంగా ప్రబలి రాత్రిళ్లు కాలనీవాసులకు నిద్ర కూడా పట్టని దుస్థితి నెలకొంది. కాల్వలు కనిపించకుండా పిచ్చి మొక్కలు పెరిగాయి. సైడ్‌కాల్వలను శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని పలువురు ‘సాక్షి’ ఎదుట వాపోయారు. సమస్యను పరిష్కరించకపోగా స్థానికులపైనే ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని చెప్పారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కాల్వలు శుభ్రం చేయించి తమను రోగాల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వాసన భరించలేక పోతున్నాం

రోడ్డుకు ఇరువైపులా కాల్వలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు బయటికి పోవడం లేదు. కాల్వల్లోనే మురికినీరు నిలుస్తుండడంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. దోమలు విపరీతంగా పెరిగి రాత్రివేళల్లో నిద్రపోనివ్వడం లేదు. వెంటనే కాల్వలు శుభ్రం చేయించాలి.

-తడుగుల సౌందర్య, కాలనీవాసి

కార్యదర్శి పట్టించుకోవడం లేదు

కాలనీలోని అన్ని వీధుల్లోనూ సైడ్ కాల్వలు పూడికతో నిండిపోయాయి. కాల్వల నుంచి వృథా, మురికినీరు బయటికి పోవడం లేదు. ఏడాదిగా సమస్యతో సతమతమవుతున్నాం. ఎన్నిసార్లు చెప్పినా పంచాయతీ కార్యదర్శి కూడా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించాలి.

- కత్తి చిరంజీవి, గ్రామస్తుడు

పరిష్కారానికి చొరవ తీసుకుంటా

రేబల్లె ఎస్సీ కాలనీలోని సైడ్‌కాల్వలను త్వరలో ప్రత్యక్షంగా పరిశీలిస్తా. కాల్వలు మురికినీరు, చెత్తతో నిండిపోవడం, పంచాయతీ సిబ్బంది పట్టించుకోకవడంపై పర్యవేక్షిస్తాం. కాలనీలో పర్యటించి సమస్యను తెలుసుకుని పరిష్కారానికి చొరవ తీసుకుంటా. పారిశుద్ధ్య పనులు చేయించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తాం.

-మోడెం శ్రీధర్, మండల పంచాయతీ అధికారి

కంఠ మహేశ్వరుడికి ప్రత్యేక పూజలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

చెన్నారావుపేట : మండలంలోని లింగగిరిలోని కంఠ మహేశ్వర ఆలయంలో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, గ్రామానికి చెందిన గౌడ కులస్తులు కంఠ మహేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడారు. గీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటాయని చెప్పారు. ఆలయాల అభివృద్ధికి, గీత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. గీత కార్మికులు, గౌడ కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు దేవేందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నర్సంపేట నియోజకవర్గ నాయకుడు వేముల సాంబయ్య గౌడ్, మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేశ్, మంద యాకయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, కుల పెద్దలు అంబాల శ్రీనివాస్, పులి రమేశ్, మంద సోములు, బూడిద వెంకన్న, మల్లం సాగర్, సప్పిడి సాగర్, గణేశ్, కుక్కల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

- హనుమత్ వాహనంపై వేంకటేశ్వరుడి ఊరేగింపు



ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

రాయపర్తి : మండలంలోని సన్నూరు వెంకటేశ్వర పల్లిలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం హనుమత్ వాహన సేవ, నమ్మాళ్వార్‌కు స్నపన, తిరుమంజనం, గరుడ వాహన సేవ, నమ్మాళ్వార్ పరమ పదోత్సవం కార్యక్రమాలను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని హనుమత్ వాహనంపై అత్యంత వైభవంగా అలంకరించి ఊరేగించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగస్వాములయ్యారు. అర్చకులు, నిర్వాహకులకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో గ్రామంలో పండగ వాతావరణం, సందడి నెలకొంది.

బీఆర్‌ఎస్ హయాంలోనే సుపరిపాలన

- జిల్లా నాయకుడు, 'ఎస్‌ఆర్‌ఆర్' చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని ఆ పార్టీ జిల్లా నాయకుడు, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జేతురాం తండా, విద్యానగర్‌తండాలకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు బీఆర్‌ఎస్‌లో ఆదివారం చేరగా వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన, ప్రజల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ఏర్పడిందని గుర్తు చేశారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని సమగ్రాభివృద్ధి దిశగా , బంగారు తెలంగాణ దిశగా నడిపిస్తున్న క్రమంలో అనేక మోసపూరిత హామీలతో ప్రజలను నమ్మించి ఓట్లు దండుకుని కాంగ్రెస్ గద్దెనెక్కిందని చెప్పారు. గడచిన 14 నెలల్లో కాంగ్రెస్ మోసపూరిత పాలనతో ప్రజలు విసిగిపోయారని తెలిపారు. అనేక ఆశలతో కాంగ్రెస్‌ను ప్రజలు, రైతులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, అన్ని వర్గాలు గెలిపిస్తే ఒరిగిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజల ఆశలు అడియాసలయ్యాయని ఆందోళన వెలిబుచ్చారు. ఆరు గ్యారెంటీల అమలులోనూ మోసపూరిత విధానాలనే కాంగ్రెస్ అవలంభిస్తోందని చెప్పారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నుంచి పలువురు బీఆర్‌ఎస్‌లోకి రావడానికి ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ప్రజల, పార్టీ కోసం కష్టపడే శ్రేణులకు అధిష్టానం తోపాటు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. పేదలకు సేవలు అందించడమే లక్ష్యంగా ఫౌండేషన్ ముందుకు సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్, మండల అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, లేతాకుల రంగారెడ్డి, లేతాకుల మధూకర్‌రెడ్డి, గారె నర్సయ్య, గజవెల్లి ప్రసాద్, ఐత రాంచందర్, పెరటి యాదవరెడ్డి, సంది దేవేందర్‌రెడ్డి, కోల సంపత్, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌ఆర్‌ఆర్' ఆధ్వర్యంలో..

ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన మాత్శచ నర్సయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి బియ్యం, ఆయిల్‌క్యాన్ సాయంగా అందజేశారు. అనంతరం గణేష్‌కుంటతండాలో హనుమాన్ ఆలయ అభివృద్ధి పనులకు విరాళం అందించారు. అలాగే మొరిపిరాలకు చెందిన పారుపల్లి సుధాకర్ రెడ్డి అనారోగ్యం బారిన పడి ఇంటి వద్ద ఉంటుండగా ఆయన్ను కలిసి పరామర్శించారు.

ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు

వర్ధన్నపేట : పట్టణంలోని బాలాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మున్సిపల్ సిబ్బంది ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. స్థానిక హనుమాన్ సేవా సమితి ప్రతినిధులు భక్తులు ఇబ్బందులను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఆలయ ప్రాంగణంలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. పిచ్చిమొక్కలను పీకి వేసి చదును చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం శుభ్రం అయ్యింది. హనుమాన్ సేవా సమితి సభ్యులు మున్సిపల్ కమిషనర్ సుధీర్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సన్మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న సుప్రియ

నెక్కొండ : సమాజంలోని ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని వరంగల్ గ్రూప్ చైర్‌పర్సన్ సుప్రియ సర్వేశ్ కోరారు. స్థానిక పరిశుద్ధ లూకా దేవాలయం (సీఎస్ఐ)లో ఆదివారం నిర్వహించిన కోతకాల పండుగలకు ఆమె హాజరై మాట్లాడారు. ఇతరుల పట్ల సోదరభావం, ప్రేమ కలిగి ఉండాలని సూచించారు. అనంతరం చిన్నారులు నృత్యాలు, బుర్రకథలతో అలరించారు. క్రీడా పోటీలు నిర్వహించిన ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ గ్రూప్ సెక్రటరీ ఆకుల అశోక్, నెక్కొండ, చెన్నారావుపేట పాస్టేట్ చైర్మన్ సహోదర్, స్థానిక గురువు సంపత్‌కుమార్, ఇవాంజలిస్ట్ పుష్పరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో శ్రీనివాస్, తదితరులు

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలోని కాకతీయ స్కూల్ విద్యార్థులు కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. నర్సంపేటలో ఆదివారం నిర్వహించిన ఇన్విటేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2025 పోటీలో స్కూల్ విద్యార్థులు బొంతల రజిత, బాషబోయిన రక్షిత, చెంగల నిత్య, చెన్న రిషిత, అయేషా కుప్పం, బండి సాంబరాజు, చెంగల ధర్మతేజ, బోయిన రిషికుమార్, సుషియన్ బంగారు పతకాలు సాధించగా మద్దరబోయిన రోహిత్, బర్ల రాహుల్, ఎంగల రేవంత్, పుల్ల సాక్షిత్, అనిమిరెడ్డి కీర్తికరెడ్డి, సట్ల మనస్వి, బేతి నిత్య వెండి పతకాలు సాధించారని తెలిపారు. విద్యార్థులు 9 బంగారు, 7 పతకాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందించారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన




ఖిలా వరంగల్ : వరంగల్ శివనగర్‌లో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఆదివారం రెండోరోజు నేత్రపర్వంగా కొనసాగాయి. వేద పండితుడు శ్రీనివాసచార్యులు, నిర్మాణ దాత గుండ్లపల్లి వెంకటేశ్వర్లు, సరస్వతి దంపతుల ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ నేతృత్వంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉదయం 8గంటలకు మండపారాధన, హోమం, సాయంత్రం 6గంటలకు ధాన్యది, శయ్యాదివాసం నిర్వహించి హారతి ఇచ్చారు.


జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

ఖిలా వరంగల్ : ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్, సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి కోరారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సంగి ఎలేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దళితులు బాగుపడాలంటే చదువే పరిష్కారమని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఎస్సీలను ఏబీసీలుగా విభవించి, దళితులకు సమాన రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సమావేశంలో తాళ్లపల్లి జాన్‌పాల్, జన్ను రాజు, శంకర్, రాజేష్, నవీన్, సునీత, కుమారస్వామి, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి డాక్టరేట్ ప్రదానం



మల్లేశం



నాగచందర్

కేయూ క్యాంపస్ : ఇద్దరు పరిశోధకులకు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. నేషనల్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కమిషన్ ఆఫ్ ఇండియా ఏ స్టడీ ఆన్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఇట్స్ రికమెండేషన్స్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు అదె మల్లేశానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సీహెచ్ దినేష్‌కుమార్ పర్యవేక్షణలో మల్లేశం తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, ఇంగ్లిష్ విభాగం పరిశోధకుడు పి.నాగచందర్‌కు డాక్టరేట్ ప్రకటించారు. ట్రిస్ట్ విత్, ఏ స్టడీ ఆఫ్ నాయిపాల్స్ ఇండియా ట్రావెలాగ్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి నాగచందర్ డాక్టరేట్ అందజేశారు. ఇంగ్లిష్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ దామోదర్ పర్యవేక్షణలో నాగచందర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

నడకతో ఆరోగ్యం, మానసికోల్లాసం

దేశాయిపేట : ప్రతిరోజూ తప్పకుండా నడవడం (వాకింగ్) వల్ల మంచి ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని వాకర్స్ అసోసియేషన్ అంతర్జాతీయ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి తెలిపారు. వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమెతోపాటు 303 ఏరియా గవర్నర్ కూరాకుల భారతి, ట్రెజరర్ సురేష్ పాల్గొని మాట్లాడారు. యాంత్రిక జీవనంలో మనిషి శారీరక వ్యాయామం లేకపోవడం వల్ల అనేక రోగాలకు గురవుతున్నామని అన్నారు. ఈక్రమంలో రోజూ ప్రతీఒక్కరికి కనీసం 20 నిమిషాల నడక తప్పనిసరి అని తెలిపారు. మైదానం అభివృద్ధికి తోడ్పడుతున్న అంతర్జాతీయ వాకర్స్ అసోసియేషన్ కౌన్సిలర్ చింతం సారంగపాణిని వారు అభినందించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సారంగపాణి, ప్రధాన కార్యదర్శి టి.రఘునాథరావు, సభ్యులు సోల రవి, సుదర్శన్‌రెడ్డి, చీర్ల శ్రీనివాస్‌రెడ్డి, కొత్త నగేష్, ఎర్రం ప్రభాకర్, నూనె వేణుప్రసాద్, జంపయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ మినీ జాతరలో మొక్కులు

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్‌లో సమ్మక్క-సారలమ్మ మినీ జాతరను పురస్కరించుకుని భక్తులు ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. నగరంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి సమ్మక్క-సారలమ్మను దర్శించుకుని బంగారం, మొక్కులు సమర్పించారు. తల్లీ సల్లంగా చూడు అంటూ వేడుకున్నారు.

సదస్సులో పరిశోధన పత్రం సమర్పణ



మామునూరు : రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఎన్సీఆర్టీ భోపాల్ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగిన జాతీయ సదస్సులో హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని పంథిని గ్రామానికి చెందిన ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు డాక్టర్ కోల రవికుమార్ 'కృత్రిమ మేధను బోధనా పద్ధతిలో అనుసంధానం చేసే అంశంపై పరిశోధన పత్రాన్ని ఎన్సీఆర్టీకి సమర్పించారు. అనంతరం రవికుమార్‌కు ఎన్సీఆర్టీ అధికారులు ప్రశంసపత్రం అందజేసి అభినందించారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా పాలన



పార్టీలో చేరిన వారితో రాణాప్రతాప్‌రెడ్డి

- బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణా ప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ లక్ష్యంగా పాలన సాగిస్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆ పార్టీ దుగ్గొండి మండల అధ్యక్షుడు నేదురు రాజేందర్ ఆధ్వర్యంలో దేశాయిపల్లికి చెందిన తుత్తురు విష్ణు, బుట్టి రాజు, పాశం రాజేందర్, తుత్తురు శ్రీకాంత్, తుత్తురు రాజు, తుత్తురు ప్రవీణ్, బుసారి నరేశ్, పాశం శ్రీకాంత్ బీజేపీలో ఆదివారం చేరగా వారిని రాణాప్రతాప్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ప్రధానిగా మోదీ అందిస్తున్న పాలనకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి పార్టీలో చేరుతున్నారని చెప్పారు. ప్రధాని మోదీ యువతకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. యువతను రాజకీయాల్లో ప్రోత్సహిస్తూ దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిదదడమే ధ్యేయంగా ప్రధాని మోదీ కార్యాచరణ అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు పొగాకు విఘ్నేశ్, పొగాకు దేవేందర్, తాడబోయిన రాజయ్య, కోటగిరి రాజ్‌కుమార్, పొగాకు రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



దుగ్గొండి: నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు



చెన్నారావుపేట : జెడ్పీ హైస్కూల్‌లో..

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో 1998–99 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం వేడుకగా సమ్మేళనం నిర్వహించారు. సుమారు 25 ఏళ్ల తర్వాత తొలిసారిగా కలుసుకోవడంతో ఒకరినొకరు మళ్లీ పరిచయం చేసుకున్నారు. నాటి తరగతి గదులను సందర్శించి చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. చిలిపి చేష్టలను గుర్తు చేసుకుని సందడి చేశారు. నాటి గురువులైన దేవకర్ణ, సదానందం, రమేశ్‌బాబు, వెంకట్‌రెడ్డి, సారంగపాణి, శ్రీదేవి, సుమతి, సంధ్యారాణి, విజయ్‌కుమార్, ప్రభాకర్‌లను శాలువాలు పూలమాలతో ఘనంగా సన్మానించారు. చిన్ననాటి మిత్రుల్లో చనిపోయిన 8 మందిని స్మరిస్తూ 2 నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కష్టాల్లో ఉన్న పేద సహచరులకు అండగా నిలవాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులైన డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త ధార రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ బానోతు శ్రీనివాస్, బండి సుజాత, రాజు, సతీశ్, రాము, రామోజీ, రజిత, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట జెడ్పీ హైస్కూల్‌లో..

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2005–06 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. సుమారు రెండు దశాబ్దాల తర్వాత తాము చదివిన స్కూల్‌లో కలుసుకుని సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం నాటి హెచ్‌ఎం వడ్డె లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ప్రభ, జనార్ధన్, శౌరీ అసంతినా, సత్యానారాయణ, హేమలతలను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రాంప్రసాద్, నదీమ్, రఫి, సురేశ్, కల్పన, స్రవంతి, రమేశ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నేటి మహాధర్నాను విజయవంతం చేయాలి

ఖిలా వరంగల్ : హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల పిలుపునిచ్చారు. ఈమేరకు ఖిలా వరంగల్ పడమరకోటలో ఠాగూర్‌భవాని అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రమ్య, స్వప్న, రమ, మల్లికాంబ, పద్మ, సరిత, శ్రీనిధి, మహాన్విత తదితరులు పాల్గొన్నారు.